# "శశిరేఖ నవల – స్త్రీ సాధికారిత"

**డా॥ లలితా జ్యోతిర్మయి కొల్లూరు**
ఆంధ్రోపన్యాసకురాలు
ఎస్.వి.జి.వి.ఎస్. కళాశాల
కొవ్వూరు
పశ్చిమ గోదావరి జిల్లా.

***Received: Aug. 2019 Accepted: Sep. 2019 Published: Oct. 2019***

20 వ శతాబ్దం వైవిధ్యంతో కూడిన ఉద్యమాల ఆవిర్భావానికి సంకేతంగా నిలిచింది. అస్తిత్వ రాజకీయ ప్రాముఖ్యాన్ని తీసుకొచ్చిన అనేక వాదాలు విభిన్న దోరణులలో వచ్చాయి. అందులో ప్రధానంగా చెప్పుకోదగ్గవి స్త్రీ, దళిత, మైనార్టీ, ప్రాంతీయ వాదాలు. 70 వ దశాబ్దం నుండీ దేశ రాజకీయాలలో వచ్చిన మార్పులు వివిధ సామాజిక ఉద్యమాలు, వాటి ప్రభావం నుండి స్త్రీవాద ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమం స్త్రీల సామాజిక జీవనంలో ఉన్న అణచివేత, పీడన, హింస, సమాజంలో స్త్రీని చులకనగా చూడటం, నిర్లక్ష్యం చేయడం మొదలగునవి ప్రశ్నించి ప్రేరేపించేలా ఉద్యమ రూపం దాల్చింది ఈ స్త్రీ వాదము.

ఇది సాహిత్యంగా రూపుదాల్చడానికి కొంతకాలం పట్టింది. ఈ సాహిత్యం ఎంత కొత్తదో స్త్రీల అణచివేత అంత పాతది. ఈ సమస్య సామాజిక సమస్యగా ఇప్పటికీ గుర్తింపు పొందినా స్త్రీల సమస్యను వైయక్తిక సమస్యగానే గుర్తించడం జరిగింది. ఇందులో వీరికి సంబంధించిన ప్రత్యేక అనుభవాలను గురించి ప్రశ్నిస్తూ, రచనా ప్రపంచంలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకుంటూ ఒక ప్రత్యేక శక్తిగా నిలిచింది. నేటి కాలంలో ఈ స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో కొత్త కోణాలకు తావివ్వటమేకాక సృజనాత్మక రచనలు సృష్టించి తెలుగు సాహిత్యాన్ని విస్తృతపరిచింది.

ఆధునిక కాలంలో కందుకూరి వీరేశలింగం పంతులు మొదలుకొని అనేక మంది కవులు వారి కావ్యాల్లో స్త్రీకి ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ రచనలు చేశారు. అలా రచనలు చేసిన వారిలో "చలం" ఒకరు. చలం రాసిన "శశిరేఖ" నవలలో స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్య సాధికారితను చెప్పాలనేది ఈ పత్రం యొక్క ముఖ్యోద్దేశం.

స్త్రీవాదం – నిర్వచనాలు :

ఆంగ్ల పదమైన (Feminism) కి తెలుగులో సమానార్థకాలుగా స్త్రీవాదం, స్త్రీ విముక్తి ఉద్యమం, స్త్రీ విమోచనోద్యమం, స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం అని వ్యవహరిస్తున్నారు. అనే పదానికి 'స్త్రీవాదం' అనే పదం వ్యవహారంలో స్థిరపడింది. ఈ పదాన్నే స్త్రీవాద రచయితలు ఎక్కువగా వాడుతున్నారు. స్త్రీవాదానికి పలువురు రచయిత్రు(త)లు పలు నిర్వచనాలు అందించారు.

1. "సమాజంలోను, కుటుంబంలోను, పనిలోనూ స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడికి సంబంధించిన అవగాహన కలిగి ఉండి ఈ పరిస్థితిని మార్చడానికి స్త్రీలు, పురుషులు చేసే చైతన్యవంతమైన కార్యక్రమమే ఫెమినిజం".

2. సమాజంలోని అన్ని రంగాలలోనూ ఆడదానికి సమాన భాగస్వామ్యం ఉండాలనీ, ఆడవాళ్ల వ్యక్తిత్వమూ, జీవితమూ కొందరి చెప్పుచేతలకి లోబడి తీర్చిదిద్దబడే పరిస్థితి మారాలనీ, ముఖ్యంగా ఆడది తల్లిగా, భార్యగా మాత్రమే ముద్ర వేయబడే ఒక లేబిల్ నుంచి మనిషిగా గుర్తించబడే స్థితి రావాలని, దానికోసం , సాంస్కృతికంగానూ, సామాజికంగానూ, సాహిత్యపరంగానూ మర్రి ఊడలై విస్తరించి ఉన్న పురుష స్వామ్యపు భావజాలం పొందాలని, ఈ భావాలతో సాగుతున్న ఉద్యమమే ఫెమినిజం".

స్త్రీ స్వేచ్ఛ :

"బయట ప్రపంచం ముఖ్యంగా పాలకులు తమ సౌఖ్యం కోసం సామాన్య జన జీవన గమనాలకు ఏవో కట్టుబాట్లూ, నిబంధనలూ విధిస్తే అవి మన జీవితానికి ఇబ్బందిని కలిగించి దుర్భరం చేస్తే, ఆ కట్టుబాట్లను ఉ ల్లంఘించటం కోసం మనం పడే ఆరాటాన్ని స్వేచ్ఛ కోసం కోరికగా అర్థం చేసుకుంటున్నాం.

ఇంకా లోతైన, గాఢమైన అర్థంలో స్వేచ్ఛంటే "స్వేచ్ఛ ఎంత బైటదో, అంత కన్నా ఎక్కువగా మనలోపలిది. మన లోపల అనివార్యంగా పుట్టుకొచ్చే ఒక కాంక్షాలాలాసత్వం, ఆనందం కోసం కోరిక ఉంటాయి. స్వేచ్ఛతో దగ్గరి సబంధం ఉన్న మరో భావం ఆనందం. మనం పొందగల ఆనందాన్ని గురించిన జ్ఞానం మనకెంతో శక్తినిస్తుంది. మన మీద మనకు అధికారాన్ని ఇస్తుంది. స్వేచ్ఛకూ, బాధ్యతకూ, ఆనందానికీ త్యాగానికీ ఉన్న సంబంధాన్ని తీసేసి వాటిని ఒకదానికొకటి వ్యతిరేక భావంలో, విరుద్ధ విషయాలుగా నిలబెట్టడం మనకు బాగా అలవాటైపోయింది. కల్పించుకున్న అర్థాలను ధిక్కరించి బైటపడటమే స్వేచ్ఛ.

స్వేచ్ఛ అనేది అన్ని రంగాలలో సమానత్వం పొందటానికి, సామాజిక చైతన్యాన్ని పెంపొందించటానికి, స్వాతంత్ర్య భావన పెంచుకోటానికి అవసరం. స్త్రీ వ్యక్తిత్వ వికాసం పెరిగినప్పుడు తమ జీవితంపై నిర్ణయాధికారం కలిగి ఉంటారు. అప్పుడే నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. స్వేచ్ఛ అనే భావనని పురుషాధిపత్యం, గుర్తింపులేని కుటుంబ చాకిరీ, లైంగిక వివక్ష లాంటి అణచివేతల నుండి విముక్తులు అవటంగా అర్థం చేసుకోవాలి గాని పురుషుల్ని వదిలి వేయటానికి, వెలి వేయటానికి స్వేచ్ఛ కాదని గుర్తించాలి.

చలం ప్రధానంగా తన రచనల్లో స్త్రీ స్వేచ్ఛను కోరాడు. పురుషుడితో సమానంగా ఆమెకు కూడా స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలని తన రచనల్లో పేర్కొన్నాడు. చలం మహిళా పక్షపాతిగా కన్పిస్తాడు. అందుకే చలం సాహిత్యం మొత్తానికి స్త్రీ కేంద్రం అన్పిస్తుంది. చలం సాహిత్యం స్త్రీ సమస్యల నుండి స్వేచ్ఛా సమస్యలోకి, సౌందర్య సమస్యలోకి క్రమంగా పరిణమించినట్లు కన్పిస్తుంది. చలం దృష్టిలో స్త్రీ అంటే సౌందర్యానికి, లావణ్యానికి, ప్రేరణకు, ప్రేమకు ప్రత్యేకంగా కన్పిస్తుంది.

గుడిపాటి వెంకటచలం 1894 మే, 19 న మద్రాసులో జన్మించారు. ఆయన కుటుంబ వాతావరణం ఆయనని స్త్రీ పక్షపాతిగా మార్చింది. తండ్రి ప్రేమను ఎరగడు. ఎప్పుడు దండిస్తూ ఉండేవాడు. తననే కాక తన తల్లిని కూడా అదే పద్ధతిలో దౌర్జన్యంగా ప్రవర్తించడం, అది చూసి ఏమి అనలేని దైన్యస్థితికి దు:ఖించి సమాజంలో పురుషుల పట్ల ఒక బేదాభిప్రాయం ఏర్పడింది. చలం 1920 – 1930 సంవత్సరాల మధ్య అనేక ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు.

నవలలు :

శశిరేఖ, దైవమిచ్చిన భార్య, అమీనా, మైదానం వివాహం.

నాటకాలు :

చిత్రాంగి, హరిశ్చంద్ర, జానకి వేదన, వెలయాలి అబద్ధాలు, సావిత్రి, శశాంక.

నాటికలు :

సత్యం, శివం, సుందరం, శావలిని.

చిన్న కథలు :

సుశీల, కన్నీటి కాలువ, కర్మమిట్లా కాలింది, మధుర మినాక్షి, అప్పుడూ ఇప్పుడూ.

సాంఘిక సమస్యలు :

బిడ్డల శిక్షణ, స్త్రీ.

చలం 1921 లో రాసిన "శశిరేఖ" మొదటి నవల కాగా 1948 లో "జీవితాదర్శం" వీరి చివరి నవల.

శశిరేఖ నవల :

చలం తొలి నవల శశిరేఖ. ఇది 1921 లో రాసిన నవల. ఈ నవలను బ్రహ్మ సమాజం నుండి బయటపడుతున్న దశలో రాశాడు. డా॥ బి.వి. కుటుంబరాయశర్మ అభిప్రాయం ప్రకారం "థామస్ హార్డీ" రచించిన "టెస్ ఆఫ్ ద్యూబర్ విల్లీ" ఛాయలు ఇందులో కన్పిస్తున్నాయి. హార్డీ రచించిన నవలల్లో కనిపించే తత్వం మూలరూపంలో ఉంది. "అందులో ఒక పాత్ర తన భర్తను విడిచిపెట్టి పరపురుషుడితో వెళ్ళిపోతుంది". దీనిని ఆధారంగా చేసుకొని చలం ఈ నవల రాశారు. వివాహం కాకపోయినా స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా ఉండవచ్చు అన్నది చలం ప్రతిపాదన. ఈ నవలలో స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యం ఉంది. తనకు నచ్చినట్లు సమాజంలో జీవించవచ్చు అన్న భావము మనకు కన్పిస్తుంది. ఈ నవలకు ప్రవేశిక "స్వామి శివశంకరులు" రాశారు. ఆయన రచయిత మనస్తత్వాన్ని బట్టి కథని విమర్శించారు.

శశిరేఖ నవల – పలువురి అభిప్రాయం :

ఈ గ్రంథము సామాన్యులకు చాలా ఆందోళన కలిగిస్తుంది. ఎప్పుడైతే పుస్తకము మనసులో ఆందోళన కలిగిస్తుందో అప్పుడే దానిలో జీవము ఉన్నదని చెప్పవచ్చు. ప్రాణగల పుస్తకాలు చాలా కదలిక పుట్టిస్తాయి. పాత ఊహల్ని తీసి నూతన భావాలను రవులు కొల్పుతవి. "శశిరేఖ" ఈ జాబితాకి చెందిన నవల. అంతేకాక గ్రంథం పూర్తి అయ్యే వరకు కవి హృదయం ఏమిటి? అన్న ప్రశ్నకు తగు సమాధానం చెప్పుకోవాలి, అలాగే "శశిరేఖ" సామాన్య స్త్రీ కాదు. ఈమె ప్రేమైక జీవిని. అందుచేతనే తనకు యోగ్యుడైన ప్రియునికోసమై ఎట్టి త్యాగమైనా చేసింది. స్వాతంత్ర్యంలేని సామాన్య స్త్రీల వంటిది కాదు. స్వధర్మ ప్రకారం ఈమె నిస్సంశయంగా పతివ్రత అని శ్రీ శివశంకర శాస్త్రి పేర్కొన్నారు.

"చలాన్ని బట్టి పురుషునకు ప్రేమ అన్నది ఒక ఆట. స్త్రీకి అలా కాదు. ప్రణయం ఆమెకు జీవనం. స్త్రీ తనకును తాను ప్రేమించువానికి శాశ్వతమగు సంబంధం ఉన్నదని భావిస్తుంది. తనని ప్రేమించినందుకు అతని ఎడ ప్రేమ చూపక మానదు. అది ఆమె కృతజ్ఞత. పురుషుని నైజం వేరు. తన ఇష్టం తీరగానే అతడు పూర్వ వృత్తాంతాన్ని మర్చిపోతాడు. ఈ రీతిగా అర్థము కల్పించుకొన్నప్పుడు "శశిరేఖ" ఉత్తమ నవల కాకపోదు" అని విశేషంగా వ్యాఖ్యానం చేశారు బొడ్డపాటి వారు.

శశిరేఖ నవల – పాత్రలు :

ఈ నవలలో చలం మొత్తం ఏడు పాత్రల్ని ప్రవేశపెట్టినారు. అవి శశిరేఖ, ఆమె తల్లి, కృష్ణుడు, సుందరరావు, కాంథొట్టు, రామారావు, నవజీవనదాసు. ఈ నవలలో శశిరేఖ తల్లి అనే పేర్కొన్నారు కాని ఆ పాత్రకు పేరు పెట్టలేదు.

శశిరేఖ నవల – ఇతివృత్తం :

ఈ నవలలో ప్రధాన పాత్ర శశిరేఖ. ఈమెకు బాల్యవివాహం జరుగుతుంది. యవ్వనంలోకి వచ్చిన కూతుర్ని అత్తవారింటికి పంపే ఏర్పాట్లు చేస్తారు తల్లిదండ్రులు. అదే సమయంలో డాక్టరు చదువుతున్న కృష్ణుడు శశిరేఖను చూసి ఇష్టపడతాడు. ఇద్దరు పరస్పరం ప్రేమించుకుంటారు. ఇంట్లో వారిని నిరాకరించి కృష్ణుడుతో వెళ్ళిపోతుంది. ఇలా ఈ నవలలో శశిరేఖ తనకును తాను ప్రేమించువానికిని శాశ్వతమగు సంబంధం ఉన్నదని భావిస్తుంది. ప్రపంచంలో శాశ్వతమైంది ప్రేమ ఒక్కటే అని ప్రేమ కోసం సమస్తం త్యజిస్తూ, ఎన్ని కష్టాలైనా పడుతూ, స్వార్థాన్ని వదిలేస్తూ, ప్రేమ లేకపోతే లోకంలేదు. ప్రేమవల్లనే మానవులు దేవతలకు సన్నిహితులౌతారు అన్న భావంతో కవి ఈ నవలను చిత్రీకరించారు. అంతేకాక స్వచ్ఛమైన ప్రేమకు వివాహ వ్యవస్థ అడ్డం కాకూడదని, స్త్రీ తనకు కావలసిన ప్రేమకోసం ఎంతోమందిని ఆశ్రయించింది. చివరకు తనకు కావలసిన ప్రేమ ఈ లోకంలో లేదని, ఎక్కడ ప్రేమకు అంతంలేదో, అంతా ప్రేమమయమో, ఎక్కడ ప్రేమకు మలినం అంటదో అటువంటిది స్వర్గమని తలచి దేవదూతలు ఆమెను సరైన స్థానానికి తీసుకువెళతారు.

చివరకు రచయిత నవజీవనదాసు పాత్ర ద్వారా ప్రేమించిన వారికి పాపంలేదు. ప్రేమమూర్తి, ప్రేమాగ్నిలో తప్తమైన పరిశుద్ధమైనది ఈమె ఆత్మ. ధన్యురాలు. ప్రేమించినది అని పలికిస్తారు.

స్త్రీ సాధికారిత :

ఈ నవలలో చలం స్త్రీకి స్వేచ్ఛ స్వాతంత్ర్యం కావాలి. తనకంటూ మనసు ఉంటుంది. తన మనస్సుకు నచ్చినట్టు తను బ్రతకవచ్చు అంటూ ఇంచుమించు వంద సంవత్సరాల క్రితం ఈ ఆలోచనా దృక్పథంలో చేసిన రచన ఇది. ఆనాటి సమాజంలో పరిస్థితులకు, ఆచార వ్యవహారాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు ఇది కొంత వ్యతిరేకంగా అనిపించవచ్చును.

సుమారు వంద సంవత్సరాల తరువాత అనేక మార్పులు సంభవించాయి. ప్రపంచీకరణా యాంత్రీకరణ దృష్ట్యా సమాజంలో స్త్రీలు స్వతంత్ర ప్రతిపత్తి భావనలు కలగడంతోపాటు, విద్యావంతులు అయి అన్ని రంగాలలో ప్రతిభ కనబరచడంచేత స్వతంత్రంగా ఆలోచించి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు అలవడుతున్నట్లు భావించవచ్చు.

వంద సంవత్సరాల క్రితం చలంగారు స్త్రీ ఏ విధంగా ఉండాలి అని కోరుకున్నారో నేడు ఇంచుమించు స్త్రీలు అన్నింటిలో ముందుంజ వేస్తూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల్ని కనబరుస్తూ తనకంటూ సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటున్నారని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య చరిత్ర – వెలమల సిమ్మన్న.
2. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి.
3. శశిరేఖ నవల – చలం
4. సమకాలీన తెలుగు నవలా సాహిత్యంలో విభిన్న వాదాలు – పరిశీలన (1980 – 2005)
5. స్వేచ్ఛ – ఓల్గా, స్వేచ్ఛ (ప్రచురణలు, హైదరాబాదు).